ఆంగ్లో ఇండియన్లకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 47 మంది ఆంగ్లో ఇండియన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు

బీచ్‌రోడ్డు: ఆంగ్లో ఇండియన్లకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం ఆంగ్లో ఇండియన్స్ కమ్యూనిటీ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లో ఇండియన్ల సంక్షేమానికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందులో భాగం తొలి విడతలో 47 మంది ఆంగ్లో ఇండియన్ లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు చేసినట్లు తెలిపారు. వారిలో 37 మంది విశాఖవాసులే ఉండటం హర్షనీయమన్నారు. రెండో విడతలో 75 మంది దరఖాస్తు చేసుకున్నారని, త్వరలో వారికి కూడా పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీలోని చట్ట సభల్లో ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు



ఆంగ్లో ఇండియన్లకు పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

ఎమ్మెల్యే వాసుపల్లి పెన్షన్ సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.ఉషశ్రీ, అసోసియేషన్ కార్యదర్శి జూన్ గాల్యాట్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది..

ఆంగ్లో ఇండియన్స్ కమ్యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎడ్వర్డ్ లాజరో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటీ సర్టిఫికెట్ జారీ కోసం జీవో ఉండేదని గుర్తుచేశారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత ఏపీలో ఆ జీవో మార్చు చేయాల్సి వచ్చిందన్నారు. ఇందు కోసం 2014 నుంచి అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్న పట్టించుకోలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ సమస్యపై ఒకే సారి వినతి పత్రం అందజేశామని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు జీవో విడుదల చేసిందని చెప్పారు. ఈమేరకు ఎడ్వర్డ్ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

క్లుప్తంగా

ఏయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ జి.శ్రీనుబాబు, హెచ్‌ఆర్‌డీసీ సంచాలకులు ఆచార్య టి.వి కృష్ణ, డాక్టర్ జి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం


జగన్‌కు నిత్యావసర సరకులు, నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సేవా సంఘం సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ నెహ్రూ నగర్‌లో సుమారు ఆరేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న జగన్ అనే వ్యక్తికి స్థానిక గణేష్ దసరా సేవా సంఘం సహకారం అందించింది. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, సత్తి మందారెడ్డి, చిన్ని రామన్, సంఘం సభ్యులు శనివారం జగన్‌ను పరామర్శించారు. నాయకుల చేతుల మీదుగా సంక్రాంతిని పురస్కరించుకుని బియ్యం, పప్పులు, నూనె ప్యాకెట్లు, తదితర నిత్యావసర సరకులతోపాటు రూ.8,000 నగదు అందజేశారు. దీంతో జగన్, అతని భార్య సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీనివాసరెడ్డి, మోహన్, సంతోష్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అపోలో ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సీవోవో శ్రీరామచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న సదస్సులో ఆర్థరైటిస్, కీళ్ల మార్పిడిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో వైద్య నిపుణులు ఆయా సమస్యలుపై సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని తెలియజేశారు. అవసరమైనవారికి ఉచితంగా ఎక్స్‌రే తీయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94410 84646 నంబరును సంప్రదించాలని సూచించారు.

వీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా కృష్ణ


ఆచార్య టి.వి.కృష్ణకు నియామక పత్రం అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఏయూక్యాంపస్: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడిగా ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు ఆచార్య టి.వి కృష్ణను కార్యాలయంలో కలిసి, శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిల్మ్ సొసైటీ నిర్వహించే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, వీఎఫ్ఎస్ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు గాయత్రి, సంతోష్ కుమార్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీతో కేఎస్‌బీ కార్యదర్శి భేటీ

రక్షణ రంగ ఉద్యోగులకు వర్సిటీ సహకారంపై చర్చ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ సైనిక్ బోర్డ్ (కేఎస్‌బీ) కార్యదర్శి కమోడోర్ హెచ్.పి సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, వివిధ అంశాలపై చర్చించారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో రక్షణ రంగాలలో వైద్యవిభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డిప్లమా ఇన్ ఫార్మసీ అందించాలని ప్రతిపాదన చేశారు. ఈ దిశగా ఏయూతో ఎంవోయూ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. రక్షణ రంగాల ఉద్యోగుల సతీమణులకు బీఏ ఫైన్‌ఆర్ట్స్ కోర్సును ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు


వీసీతో సమావేశమైన హెచ్.పి.సింగ్

ఏయూ పరంగా అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఆర్ఎస్‌బీ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వి రెడ్డి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

ఏయూక్యాంపస్: పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియలో శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మహారాణిపేట సీఐ సోమశేఖర్ సూచించారు. అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు ఉద్యోగార్థుల శిక్షణ తరగతుల శిబిరానికి శనివారం ఆయన హాజరై అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు. ఉద్యోగం సాధించడంలో శారీరక దారుఢ్య పరీక్ష తొలి మెట్టుగా నిలుస్తుందన్నారు. సరైన శిక్షకుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవాలని, దీని వల్ల సులభంగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం వీలవుతుందని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండటం, నిత్యం వ్యాయామం చేయడం ఎంతో అవసరమన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని యువత పరిరక్షించుకోవాలని సూచించారు. బాధ్యతాయుత పౌరులుగా, భవిష్యత్ సమాజ రక్షకులుగా నిలవాలని సీఐ సోమశేఖర్ ఆకాంక్షించారు.


పోలీసు ఉద్యోగార్థులకు సూచనలిస్తున్న సీఐ సోమశేఖర్

నోరూరిస్తున్న వంటకాలు


సిద్ధంగా పాట్ బిర్యానీలు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర పర్యాటక శాఖ, ఫుడ్ మాన్యా సంయుక్తంగా ఆర్కే బీచ్ తీరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లోని ఆహారం సందర్శకుల నోరూరిస్తోంది. ఆంధ్ర ఫుడ్, నార్త్, సౌత్, చైనీస్ వంటకాలతో ఆహార ప్రియులను ఆకట్టుకుంటోంది. గోంగూర చికెన్, గోంగూర మటన్, పాట్ బిర్యానీ, బొంగులో చికెన్, నాటుకోడి చికెన్ నోరూరిస్తున్నాయి. ఈ ఫెస్టివల్ ఆదివారం రాత్రి వరకు కొనసాగుతుంది.

'ప్రభుత్వం నిరంకుశ విధానాలు మానుకోవాలి'

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలు మానుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా 17వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి సత్తిబాబు, 17వ వార్డు ఇన్‌చార్జి కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి శంకుస్థాపన చేశారు. నెహ్రూ నగర్‌లో రూ.15.50 లక్షలతో సచివాలయ భవనం, సంతోషిమాత కాలనీలో రూ.7 లక్షలతో రక్షణ గోడ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాలను చేపడుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ శివప్రసాద్, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

పీవీ చలపతిరావుకు ఎమ్మెల్సీ వంశీకృష్ణ నివాళి

మద్దిలపాలెం: బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావు మృతికి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం పిఠాపురం కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి, పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన తనయుడు ఎమ్మెల్సీ మాధవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వంశీకృష్ణ వెంట ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కండిపల్లి శ్రీధర్, రమణమూర్తి ఉన్నారు.


చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

12వ వార్డు కొండవాలు సమస్యలపై ఆరా

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు బీసీ కాలనీ కొండవాలు ప్రాంతంలో శనివారం కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పర్యటించారు. అక్కడి రోడ్లు, కాలువలను పరిశీలించారు. స్థానికులతో ఆమె మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ రక్షణ గోడలు లేకపోవడంతో తరుచూ వృద్ధుల్, పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారని, కుళాయిలు సకాలంలో రావడం లేదని, విద్యుత్ దీపాలు వెలగకపోవడం తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీతో ఆమె మాట్లాడి బీసీ కాలనీ కొండపై రోడ్ల పక్కన రక్షణ గోడలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.


బీసీ కాలనీ కొండపై రక్షణ గోడ లేని రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోహిణి

కంచి కామకోటి పీఠాధిపతిని దర్శించిన సీపీ

సీతంపేట: స్థానిక శంకరమఠంలో వేంచేసియున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతిని శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. ఉదయం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైకోర్టు అడ్వకేట్ కాశ్యప్ స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం మఠంలో ఏర్పాటు చేసిన ముట్నూరి జలజాక్షి గాత్ర కచేరి, వాయులీనం , చాగంటి కిరణ్మయి సహాయ గానం అలరించాయి. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.


విజయేంద్ర సరస్వతికి ఫలాలు సమర్పించి ఆశీస్సులు అందుకుంటున్న పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని యాత్ర

సీతంపేట: కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని పల్లె నుంచి ఢిల్లీ వరకు ప్రజా పోరు రథయాత్ర నిర్వహించనున్నట్టు కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ తెలిపారు. రామా టాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించడంతోపాటు నూతన పార్లమెంట్‌కు ఆయన పేరు పెట్టాలని, గణతంత్ర దినోత్సవంలో ఆయన చిత్రపటం పెట్టాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26న విశాఖ అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు రథయాత్ర చేస్తామని చెప్పారు. ప్రజలు, నాయకులు మద్దతిచ్చి జయప్రదం చేయాలని కోరారు.

నేడు వైభవుడికి కదంబ ప్రసాదం సమర్పణ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కదంబ ప్రసాదం సమర్పిస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఈ ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రసాదాన్ని 21 రకాల కూరగాయలు, ఆకుకూరలతో సమ్మిళితంగా తయారు చేయిస్తామన్నారు. ఇందుకోసం అవసరమైన సరకులను మహిళలు శనివారం సిద్ధం చేశారు. ఈ ప్రసాదం తింటే ఆరోగ్యంగా ఉంటామని భక్తులు నమ్ముతారు. దీన్ని ఆలయంలో భక్తులకు వడ్డిస్తారు. ఉదయం పూజలు పూర్తయిన తర్వాత ప్రసాదాన్ని అందిస్తారు.

ఘనంగా సుప్రభాత సేవ

వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


కదంబ ప్రసాదానికి సరకులు సిద్ధం చేస్తున్న మహిళలు

ప్రతి ప్రయాణం కొత్త పాఠం

సీతంపేట: నేను చేసిన ప్రతి ప్రయాణం నుంచి కొత్త పాఠం నేర్చుకున్నానని ప్రముఖ యాత్రా సాహిత్య రచయిత దాసరి అమరేంద్ర అన్నారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన రచించిన 'గల్ఫ్ గీతం', 'గల్ఫ్ యాత్రాగాథ' పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ప్రయాణాలు చేయడం వల్ల కొత్త ప్రదేశాలు చూడటంతో పాటు ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుస్తాయన్నారు. గల్ఫ్ దేశాల ప్రజల జీవన శైలిని అధ్యయనం చేయడానికి గల్ఫ్‌కు వెళ్లానని, యాత్రా సాహిత్యానికి సంబంధించి ఇప్పటి వరకు ఏడు పుస్తకాలు రాశానని తెలిపారు. గల్ఫ్‌లో తాను చూసిన ప్రదేశాలు, తనకు తారసపడిన మనుషులు, మనస్తత్వాల గురించి పుస్తకంలో వివరించారు. ప్రముఖ రచయిత్రి కేఎస్ మల్లీశ్వరి పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ అనువాద రచయిత ఎల్.ఆర్.స్వామి ఆధ్యక్షతన జరిగిన సభలో రచయిత అడపా రామకృష్ణ, విశాఖ సంస్కృతి సంపాదకుడు శిరేల సన్యాసిరావు, పలువురు రచయితలు, సాహితీప్రియులు పాల్గొన్నారు.


అమరేంద్రను సత్కరిస్తున్న రచయితలు

సంక్రాంతి సందడి


చెరకు, పాల కుండల చుట్టూ వివిధ వేషధారణల్లో విద్యార్థులు


సోది చెబుతున్న చిన్నారి

- విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఘనంగా సంబరాలు
- ఆడిపాడిన చిన్నారులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: పాఠశాలల్లో సంక్రాంతి సందడి మొదలైంది. జాతీయ రహదారి పక్కన రూరల్ రెవెన్యూ కార్యాలయం సమీపంలోని విశాఖ వ్యాలీ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణాన్ని పచ్చని తోరణాలు, వివిధ రకాల రంగుల పూల దండలలో అలంకరించారు. ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంబరాల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. పాఠశాల ఆవరణ పాటలు, నృత్యాలు, రంగవల్లులు, పిల్లలు భోగిపళ్లు పోయడం, హాస్య నాటికలు ప్రదర్శనతో సందడిగా మారింది. విద్యార్థులు హరిదాసులు, సోది చెప్పే మహిళలు, గంగిరెద్దుల ఆడించే వాళ్లు, గిలకల వాళ్లు తదితర వేషధారణలతో పల్లెటూరి వాతావరణాన్ని కళ్ల ముందుకు తీసుకొచ్చారు. ఓ చిన్నారి సోది చేప్పే మహిళ వేషధారణలో తోటి విద్యార్థులకు సోది చెబుతూ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ఉత్సాహంతో సంప్రదాయ నృత్యాలు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. సంక్రాంతి సందర్భంగా పల్లెల్లోని రైతులు తమ ఇళ్లల్లో తయారు చేసుకునే పిండి వంటలను సిద్ధం చేశారు. అరిసెలు, లడ్డూలు, పూతరేకులు, జంతికలు, కాజాలు, మినప సున్నుండలు పొంగలి తదితర వంటకాలను ప్రదర్శించి వాటి ప్రాధాన్యం గురించి విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఈశ్వర ప్రభాకర్ వివరించారు. సంక్రాంతి పండగ ప్రాధాన్యం గురించి తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.


విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

దివ్యాంగ విద్యార్థులకు సంక్రాంతి కానుకలు

సీతంపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దాతల సహకారంతో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. 60 మంది దివ్యాంగ విద్యార్థులకు వెయ్యి రూపాయల విలువైన సరకుల కిట్లు అందజేశారు. 5 కిలోల రైస్, శెనగపప్పు, మినపప్పు, కందిపప్పు, బెల్లం, పాలు, చింతపండు వంటి ఎనిమిది రకాల నిత్యావసర సరకులు కిట్‌లో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముఖ్య అతిథులు శ్రీవెంకటేశ్వర డెవలపర్స్ ప్రతినిధులు సీతారామయ్య, నాగరాజు, ఇండియన్ రైల్వేస్ డివిజనల్ ఇంజినీర్ శివనరేష్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా ప్రజ్వల్‌వాణి సంస్థ అధ్యక్షురాలు సుచిత్రారావు మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండగకు దివ్యాంగ పిల్లలు పిండి వంటలు తినేలా దాతల సహకారంతో కిట్స్ పంపిణీ చేశామన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు జె.బాలకృష్ణ, కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.


సరకులు అందజేస్తున్న అతిథులు, దాతలు

వక్తృత్వ పోటీలతో మెరుగైన నైపుణ్యం

దాబాగార్డెన్స్: నైపుణ్యం పెంచుకోవడానికి వక్తృత్వ పోటీలు దోహదపడతాయని అటవీ క్షేత్ర విశాఖ రేంజ్ అధికారి బిర్లంగి రామనరేష్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం విశాఖ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ లైఫ్ అండ్ లెగసీ ఇన్ ది ఏజ్ ఆఫ్ అమృత కాల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక యువత విషయాన్ని సమగ్రంగా తెలుసుకోవడం, ఉపన్యాసాన్ని విశ్లేషణాత్మకంగా తయారు చేసుకోవడం, సమయపాలన, పొరపాట్లు దొర్లకుండా ఉండడానికి ముందుగా శిక్షణ పొందాలన్నారు. యుక్త వయస్సు నుంచి వక్తృత్వ పోటీల్లో పాల్గొనడం వల్ల వేదిక భయం పోతుందన్నారు.